# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఈరోజు నిర్వహించే 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ' సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**
2. **తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆదర్శంగా నిలిచిందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.**
3. **అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**
4. **తెలంగాణలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **జాతీయ ప్రసార దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇన్వెస్ట్ ఇండియా, భారత పరిశ్రమల సమాఖ్య-సీఐఐ ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ -యూఏఈకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చించేందుకు 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ' సదస్సు ఈరోజు జరుగుతుంది. విజయవాడలో జరిగే ఈ సదస్సులో యూఏఈకి చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు 200 మంది హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరిస్తారు.

-------------------------

అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అన్నదాతా సుఖీభవ పథకంలో 47 లక్షలకు పైగా రైతుల ఈ-కేవైసీ పూర్తయిందని చెప్పారు.రాష్ట్రంలోని అన్ని కాలువల ద్వారా సాగు అవసరాలకు నీటిని విడుదల చేయాలని.. చివరి ఆయకట్టు వరకూ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 20లోపు హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు, ఆగస్టు 15లోపు మామిడి రైతులకు చెల్లింపులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆదర్శంగా నిలిచిందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కులగణనను మంత్రి వర్గ సమావేశంలో ఆమోదించి, శాసనసభలో ప్రవేశపెట్టామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బీసీ బిల్లుకు పార్లమెంటులోనూ మద్దతు ఇవ్వాలని కోరనున్నామని ఉపముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్ 34 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లను నియమించింది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతం చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం వెంపరాలలో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అలాగే ఎస్సీ కాలనీలో ఇంటింటికి కుళాయి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామసభలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---

జాతీయ ప్రసార దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మన దేశంలో ప్రప్రథమంగా రేడియో ప్రసారాలు 1927, జూలై 23వ తేదీన ముంబైలో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. దానిని పురస్కరించుకుని ప్రతి ఏటా జూలై 23వ తేదీన జాతీయ ప్రసార దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. కాగా దేశంలో పెద్ద సమాచార వ్యవస్థగా ఆకాశవాణి వెలుగొందుతోంది. అనేక ప్రాంతీయ భాషల్లో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సాంస్కృతిక, ఆర్థిక సామాజిక అంశాలతో కూడిన కార్యక్రమాలను తనదైన శైలిలో ప్రజలు మెచ్చే రీతిలో ప్రసారం చేస్తోంది. అన్నిటికంటే.. ఆకాశవాణి విభిన్న భాషల్లో ప్రసారం చేసే జాతీయ, ప్రాంతీయ వార్తలు అత్యంత విశ్వసనీయమైనవిగా ప్రజాదరణ పొందుతున్నాయి.

---

ఆంధ్రప్రదేశ్‌లో సహజ ప్రసవాల పెంపునకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నామని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం 56.12 శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగాయని తెలిపారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయం, ప్రసవానంతర సేవలకు సంబంధించిన అంశాలపై ఎంపిక చేసిన నర్సులకు 18 నెలల పాటు సమగ్ర శిక్షణ

అందించేలా తద్వారా సహజ ప్రసవాల శాతం పెరిగేలా ఈ పథకాన్ని రూపొందించామని మంత్రి పేర్కొన్నారు. తొలి విడతలో ప్రసవాల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న 86 ఆసుపత్రుల్లో ఈ పథకం అమలు చేయనున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా స్థాయి ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అవసరమయ్యే బ్యాలెట్ పెట్టెలు, పోలింగ్ సిబ్బంది, ఇతర వనరుల సమాచారం నిర్ణీత నమూనాలో పంపించాలని సూచించింది. సెప్టెంబరు 30 నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలనే హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించేలా కలెక్టర్లు సన్నద్ధంగా ఉండాలని నిర్దేశించింది. జిల్లా స్థాయి ఎన్నికల ప్రణాళికలో.. ఒక మండలంలోని అన్ని పంచాయతీల ఎన్నికలు ఒకే దశలో ఉండేలా సూచించాలని కోరింది.

---------------------------

భారత్, ఇంగ్లాండ్ మహిళా క్రికెట్ జట్ల మధ్య లండన్ లో జరుగుతున్న మూడవ వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకొన్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్లకు 318 పరుగులను చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 305 పరుగులు చేయడంతో 13 పరుగుల తేడాతో భారత మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించింది. ఇక పురుషుల క్రికెట్‌లో భారత్ –ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగవ టెస్ట్ మ్యాచ్ మాంచెస్టర్ వేదికగా ఈ రోజు ప్రారంభం కానుంది.

---------------------------

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..20 సెకన్లు

ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1906 జూలై 23న మధ్యప్రదేశ్‌లోని భబ్రాలో జన్మించిన ఆయన స్వాతంత్రోద్యమంలో భాగంగా కాకోరి రైలు దోపిడీ, బ్రిటిష్ పోలీసు అధికారి జాన్ సాండర్స్ హత్య వంటి వాటిలో కీలక పాత్ర పోషించారు. 1931 ఫిబ్రవరి 27న శత్రువు చేత చిక్కకుండా తనను తాను కాల్చుకుని ఆత్మాహుతి చేసుకుని చిరస్మరణీయులైయ్యారు. చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా, భారతదేశం ఆయన ధైర్యాన్ని, దేశభక్తిని స్మరించుకుంటుంది.

=====================